

శిథిలాల తొలగింపు

ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో ఆదివారం శిథిలాల తొలగింపు ప్రక్రియ కొనసాగింది.

వివరాలు 8లో ▸



ఆలయాలు కిటకిట

ఆదివారం అమావాస్య సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని పలు ఆలయాలకు భక్తులు పోటెత్తారు.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 41.7/30.9

ఉదయం, మధ్యాహ్నం ఎండ తీవ్రత కనిపిస్తుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై చిరు జల్లులు కురవచ్చు.

న్యూస్‌రీల్

'సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి'



వనపర్తి రూరల్: కేంద్ర ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మే 20న దేశ వ్యాప్తంగా చేపట్టే సార్వతిక సమ్మెను జయ ప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులు పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని జిల్లా కార్యాలయంలో నాయకులతో కలిసి సమ్మెకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తూ.. 29 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్లను ముందుకు తెచ్చిందన్నారు. వీటికి వ్యతిరేకంగా ఐదేళ్లుగా కార్మిక వర్గం చేస్తున్న ఆందోళనలు చేస్తున్నా.. వాటిని అమలుచేసి కార్మిక హక్కులను పూర్తిగా హరించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. సార్వత్రిక సమ్మెలో అన్నిరంగాల కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు గంధం మదన్, నందిమళ్ల రాములు, రత్తయ్య, రవి, విజయ్‌కుమార్, రామచంద్రయ్య, చిన్ననాగన్న తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక' పోరులో సత్తా చాటుదాం : బీజేపీ



అమరచింత: గ్రామాల్లో పార్టీని బలోపేతం చేస్తూ స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి కోరారు. ఆదివారం మండలంలోని కిష్టంపల్లిలో జరిగిన మండలస్థాయి బూత్ కమిటీల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను గ్రామాల్లో ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం ఉచితంగా అందిస్తున్న ఘనత కేంద్రానిదేనన్న విషయాన్ని ప్రజలకు తెలియజేయాలని సూచించారు. నియోజకవర్గంలోని అమరచింత, ఆత్మకూర్, మక్తల్ పురపాలికలు బీజేపీ కైవసం చేసుకునేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షురాలు మంగ లావణ్య, నాయకులు మేర్వ రాజు, హరీశ్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యూఎఫ్ కార్యవర్గం ఎన్నిక

వనపర్తి టౌన్: జిల్లాకేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం వనపర్తి డిపో ఎస్‌డబ్ల్యూఎఫ్ (సీఐటీయూ) కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు గౌరవ అధ్యక్షుడు పుట్టా ఆంజనేయులు తెలిపారు. అధ్యక్షుడిగా ఏజీ కృష్ణ, ఉపాధ్యక్షులుగా నర్సింహ, నారాయణ, కార్యదర్శిగా నాగేశ్వర్, సహాయ కార్యదర్శిగా శేఖర్, కోశాధికారిగా కురుమయ్య, ప్రచార కార్యదర్శిగా గోవర్ధన్, మహిళా కన్వీనర్‌గా జానకి, సభ్యులుగా రాములు, శాంతన్న, శేఖరయ్య, చంద్రశేఖర్ ఎన్నికయ్యారు. అంతకుముందు నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు వీరాంజనేయులు మాట్లాడుతూ.. ఆర్టీసీలో ట్రేడ్ యూనియన్ లేకపోవడంతో యాజమాన్యం కార్మికుల హక్కులను హరిస్తోందని, పని గంటలు పెంచి, సింగిల్ క్రూ డ్యూటీ పెంచి నామమాత్రపు ఓవర్‌టైం ఇస్తూ కార్మికుల శ్రమ, శక్తిని హరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి కార్మికుల చట్టాలను తుంగలో తొక్కుతున్నాయని, కార్మికులంతా కలిసి ఐక్య పోరాటాలతో ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రీజియన్ ప్రచారకార్యదర్శి క్రాంతికుమార్, సహాయ కార్యదర్శి ఎండీ ఖయ్యూం, ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడు రాములు తదితరులు పాల్గొన్నారు.

'బీసీలకు 42 శాతం టికెట్లు కేటాయించాలి'

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు 42 శాతం టికెట్లు కేటాయించాలని అఖిల భారత బీసీ సంఘటన సమితి జాతీయ అధ్యక్షుడు మెట్టుకాడి శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ బీసీ మహాసభ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన బీసీ ప్రముఖుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహబూబ్‌నగర్ మేయర్ సీటును బీసీ మహిళకు రిజర్వు చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే విశ్వకర్మ, రాజు యువశక్తి, ముద్ర వంటి సంక్షేమ పథకాలను అందిపుచ్చుకోవాలన్నారు.

క్రీడా శిక్షణకు వేళాయె..



శ్రీరంగాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో కబడ్డీ శిక్షణలో విద్యార్థులు (ఫైల్)

జిల్లాలో మే నెల 1 నుంచి తరగతులు ప్రారంభం

- జిల్లావ్యాప్తంగా 17 శిబిరాలు ఏర్పాటు
- శిక్షకులకు గౌరవ వేతనం చెల్లింపు
- 14 ఏళ్లలోపు విద్యార్థులకు అవకాశం

అమరచింత: ప్రభుత్వం వేసవి సెలవుల్లో బడిఈడు పిల్లలు చెడుదారి పట్టకుండా వారికి క్రీడలపై మక్కువ పెంచేందుకు నచ్చిన ఆటలను పరిచయం చేస్తూ వాటిలో తర్ఫీదునిచ్చేందుకు వేసవి క్రీడా శిబిరాలను నిర్వహిస్తోంది. ఈ శిబిరాలు మే నెల 1 నుంచి నెలాఖరు వరకు కొనసాగనున్నాయి. వాలీబాల్, ఫుట్‌బాల్, హాకీ, కబడ్డీ తదితర క్రీడల్లో నైపుణ్యాలు గల శిక్షకుల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి శిక్షణ కేంద్రాలు మంజూరు చేశారు. ఇప్పటికే కేంద్రాల కేటాయింపు ప్రక్రియ పూర్తయిందని.. క్రీడా శిక్షకులకు ప్రతి నెల ప్రభుత్వం రూ.4 వేల గౌరవ వేతనం ఇవ్వనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఆసక్తిగల 14 ఏళ్లలోపు విద్యార్థులు తమ పేర్లు నమోదు చేసుకొని శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు సూచిస్తున్నారు.

జిల్లాలో 17 కేంద్రాలు..

జిల్లాలోని మదనాపురం, గోపాల్‌పేట, ఏదుట్ల, వీపనగండ్ల, ఖిల్లాఘనపురం, పాన్‌గల్, కొత్తకోట, ఆత్మకూర్, మూలమళ్లతో పాటు జిల్లాకేంద్రంలో అధికంగా క్రీడా శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఆయా మండలాల్లోని పీఈటీల ప్రోత్సాహంతో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి మొత్తంగా 17 శిబిరాలు వేసవిలో కొనసాగిస్తున్నారు.

క్రీడాసామగ్రి పంపిణీ..

వేసవి క్రీడా శిబిరాలకు ప్రభుత్వమే ఉచితంగా క్రీడా సామగ్రిని అందిస్తుందని జిల్లా క్రీడలు, యువజనశాఖ అధికారి తెలిపారు. వాలీబాల్, ఫుట్‌బాల్, క్రికెట్ కిట్లు, అథ్లెటిక్స్ సామగ్రిని ఆయా కోచ్‌లకు జిల్లాకేంద్రంలో అందిస్తున్నట్లు చెప్పారు. శిక్షణకు వచ్చే విద్యార్థులు వీటిని వినియోగించుకొని కోచ్ వద్ద భద్రపర్చుకోవాలని సూచించారు. ప్రథమ చికిత్స కిట్ల కొనుగోలుకుగాను జిల్లాకు రూ.5 వేలు మంజూరయ్యాయని తెలిపారు.

శిక్షణతో ప్రయోజనం..

30 రోజుల క్రీడా శిక్షణతో విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది. పాఠశాల స్థాయిలో నిర్వహించే ఆటల పోటీలతో పాటు డివిజన్, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. వేసవి సెలవులు వృథా కాకుండా రోజు ఉదయం ఎనిమిది వరకు, సాయంత్ర ఐదు నుంచి ఆరు వరకు శిక్షణ ఇవ్వనున్నారు.

30 రోజుల శిక్షణ..



జిల్లాలో మే నెల 1 నుంచి 31 వరకు విద్యార్థులకు వివిధ క్రీడల్లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నాం. ఇప్పటికే శిక్షకులకు అన్నిరకాల సూచనలు చేశాం. 14 ఏళ్లలోపు బాలలు శిక్షణలో పాల్గొనే అవకాశం ఉంది. శిబిరంలో ఎంతమంది విద్యార్థులైనా పాల్గొనవచ్చు. శిక్షకులకు రూ.4 వేల గౌరవ వేతనం చెల్లిస్తూ విద్యార్థులకు తర్ఫీదునిచ్చేలా ప్రోత్సహిస్తున్నాం. – సురేందర్‌రెడ్డి, డీవైఎస్‌ఓ

శిక్షణ శిబిరాల వివరాలు..

కేంద్రం	క్రీడ పేరు	శిక్షకుడు
మదనాపురం	వాలీబాల్	రామ్మోహన్
గోపాల్‌పేట	ఫుట్‌బాల్	సందీప్
ఏదుట్ల	ఫుట్‌బాల్	రాజేందర్
వీపనగండ్ల	ఫుట్‌బాల్	అశోక్
ఖిల్లాఘనపురం	అథ్లెటిక్స్	దేవేందర్
పెద్దమందడి	హాకీ	మన్యం
వనపర్తి	హాకీ	గణేష్
మందాపురం (పాన్‌గల్)	హాకీ	గోవింద్
అప్పరాల (కొత్తకోట)	అథ్లెటిక్స్	అజయ్‌కుమార్
మూలమళ్ల (ఆత్మకూర్)	కబడ్డీ	కేశవులు
ఆత్మకూర్	వాలీబాల్	ఖాదర్
వనపర్తి	కిక్‌బాక్సింగ్	శేఖర్
	ఫుట్‌బాల్	ప్రవీణ్
	వాలీబాల్, చెస్,	ముజీబ్, జితేందర్
	హాకీ	జావెద్, సాగర్
పెబ్బేరు	ఫుట్‌బాల్	నాగరాజు

ఒత్తిళ్లకు తలొగ్గి..

ప్రైవేట్ కళాశాలల సూచనలతో డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు వాయిదా

- 9 రోజులపాటు నిలిపివేయడంతో పీజీసెట్, లాసెట్‌పై ప్రభావం
- అఫ్లియేషన్, ర్యాటిఫికేషన్ ప్రక్రియపై పట్టింపులేని వైఖరి
- ఆదేశాలను బేఖాతరు చేస్తున్న యాజమాన్యాలు
- పీయూ అధికారుల తీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు



పాలమూరు యూనివర్సిటీ ముఖద్వారం



పరీక్షలు వాయిదా వేస్తున్నట్లు పీయూ అధికారులు జారీ చేసిన సర్క్యులర్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో వింత ధోరణి నడుస్తోంది. ప్రైవేట్ కళాశాలలను నియంత్రించాల్సిన యూనివర్సిటీ అధికారులు.. ఏకంగా వారి ఒత్తిళ్లకే తలొగ్గి పనిచేయాల్సిన దుస్థితికి చేరుకున్నారు. ఈ నెల 28 నుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు 2, 4, 6 నిర్వహిస్తున్నట్లు గతంలో సర్క్యులర్‌ను కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ బ్రాంచ్ విడుదల చేయగా.. ఈ నెల 25న వాటిని వాయిదా వేస్తున్నట్లు మరో సర్క్యులర్ జారీ చేశారు. దీనికి కారణం 'ప్రైవేట్ కళాశాలల విజ్ఞప్తి మేరకు' మాత్రమే వాయిదా వేసినట్లు అందులో పేర్కొనడం గమనార్హం. సాధారణంగా పరీక్షలు వాయిదా వేయాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వివిధ పోటీ పరీక్షలు, సెలవుల దృష్ట్యా మాత్రమే వాయిదా వేస్తారు. కానీ, ఇక్కడ మాత్రం ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు ఒత్తిళ్లతో వాయిదా వేస్తున్నారని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. కేవలం ప్రైవేట్ కళాశాలలకు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వనందుకే ఈ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయన్న చర్చ జరుగుతోంది.

విద్యార్థులకు తీవ్రనష్టం..

పీయూ పరిధిలో యూజీ, పీజీ, బీఈడీ తదితర అన్ని కళాశాలలు కలిపి 102 ఉండగా.. వీటిలో సుమారు 22 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. డిగ్రీ పూర్తయిన వెంటనే పీజీలో పీజీ సెట్, లా సెట్, ఎంబీఏ వంటి కోర్సులలో ప్రవేశాలకు విద్యార్థులు సిద్ధం కావాల్సి ఉంది. ఎంట్రెన్స్‌లకు చదివేందుకు కనీసం 15 రోజుల సమయం కూడా సరిపోదని విద్యార్థులు పేర్కొంటున్నారు. ఇప్పుడు పరీక్షలు వాయిదా వేయడం వల్ల ఫలితాలు, మెమోల జారీ వంటి ప్రక్రియ కూడా ఆలస్యమయ్యే అవకాశాలున్నాయని.. ఇలా చేయడం వల్ల విద్యార్థులకు తీవ్రనష్టం జరుగుతుందని వాపోతున్నారు. యథావిధిగా షెడ్యూల్ ప్రకారం పరీక్షలు నిర్వహించాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. అయితే వాయిదా వేసిన డిగ్రీ పరీక్షలను అధికారులు వచ్చే నెల 6 నుంచి నిర్వహించనున్నారు.

ర్యాటిఫికేషన్ కోసం..

పీయూ పరిధిలోని అన్ని ప్రైవేటు డిగ్రీ కళాశాలలు ర్యాటిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ఇందుకోసం ఈ నెల 23 చివరి తేదీ కాగా.. 24 నుంచి 30 వరకు అన్ని కళాశాలల యాజమాన్యాలు టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది వివరాలను అధికారులకు సమర్పించాలని ఈ నెల 7న యూనివర్సిటీ ఆడిట్ సెల్ డైరెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. వీటితో పాటు కళాశాలల్లో వసతులపై ఇన్‌స్పెక్షన్ చేయించుకోవాలని సూచించింది. అయితే అధికారుల సూచనల ప్రకారం కొన్ని కళాశాలలు మాత్రమే దరఖాస్తు చేసుకోగా.. మరికొన్ని కళాశాలలు వాటిని పట్టించుకోలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కళాశాలల అఫ్లియేషన్ చివరిసారిగా 2022లో నిర్వహించగా.. తర్వాత గత వీసీ హయాంలో ప్రైవేటు కళాశాలలు అఫ్లియేషన్, ర్యాటిఫికేషన్ వంటి వాటి జోలికి వెళ్లలేదు. ప్రస్తుతం కొత్త వీసీ వచ్చాక పరిస్థితిలో మార్పు వస్తుందని భావించినా.. గతంలో మాదిరిగానే వాటిని మూలకు పెట్టినట్లు తెలుస్తోంది.

ఇబ్బందులు రానివ్వం..



ప్రైవేటు కళాశాలలకు ఎట్టి పరిస్థితిలోనూ ర్యాటిఫికేషన్, అఫ్లియేషన్ ఇన్‌స్పెక్షన్ చేపడతాం. వీటికోసం ఈ నెల 23 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించాం. అలా చేస్తేనే దోస్త్‌లో అడ్మిషన్లు చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. సమస్యలు ఉన్న కారణంగా వాయిదా వేసిన పరీక్షలను వచ్చేనెలలో నిర్వహిస్తాం. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. – రమేష్‌బాబు, పీయూ రిజిస్ట్రార్

షెడ్యూల్ ప్రకారమే..



అసలు యూనివర్సిటీ అధికారులు ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలకు ఎందుకు తలొగ్గి.. పరీక్షలు వాయిదా వేశారు. ఇలా చేయడం వల్ల విద్యార్థులకు నష్టం కలుగుతుంది కాబట్టి కచ్చితంగా వాటిని షెడ్యూల్ ప్రకారమే నిర్వహించాలి. అలాగే ర్యాటిఫికేషన్, ఇన్‌స్పెక్షన్ వంటి ప్రక్రియలు వెంటనే పూర్తిచేయాలి. – రాము, యూనివర్సిటీ ఎస్‌ఎఫ్‌ఐ అధ్యక్షుడు

ఉద్యమం చేపడుతాం..



ప్రైవేటు కళాశాలలకు రీయింబర్స్‌మెంట్ రాకుంటే పరీక్షలు వాయిదా వేసి విద్యార్థులకు నష్టం చేస్తారా.? పీయూ అధికారుల ఈ తీరు హాస్యాస్పదంగా ఉంది. ప్రైవేటు కళాశాలల్లో వసతులు మెరుగుపడాలంటే ర్యాటిఫికేషన్, ఇన్‌స్పెక్షన్ వంటివి చేపట్టాల్సిందే. పీయూ అధికారులు తీరు మార్చుకోకుంటే ఏబీవీపీ ఆధ్వర్యంలో ఉద్యమం చేపడుతాం. – నాగేష్, యూనివర్సిటీ ఏబీవీపీ అధ్యక్షుడు

అకాల వర్షం.. అపార నష్టం





మార్కెట్‌యార్డులో తడిసిన ధాన్యాన్ని దగ్గరకు చేర్చుతున్న రైతులు

తడిసిన ధాన్యం.. నిలిచిన విద్యుత్ సరఫరా

ఆత్మకూర్: అకాల వర్షం అపార నష్టం తెచ్చిపెట్టింది. ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో వర్షం దంచి కొట్టింది, దీంతో కల్లాలు, మార్కెట్‌యార్డులో ఆరబోసిన ధాన్యం తడిసి పోవడంతో పాటు వరద నీటిలో కొట్టుకుపోయింది. చెట్లు విరిగి రోడ్లు, తీగలపై పడటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అమరచింత–ఆత్మకూర్ మధ్యలో 33 కేవీ విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. సకాలంలో ధాన్యం కొనుగోళ్లు చేయక, కొనుగోలు చేసిన ధాన్యం తరలించకపోవడంతో కష్టాలు తప్పడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వరి పంటలు నేలకొరగగా.. మామిడి కాయలు రాలిపోయాయి. మండల కేంద్రంలో రహదారులన్నీ జలమయమయ్యాయి. గాంధీచౌక్‌లో వర్షపు నీరు నిలువడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సంతలో కూరగాయలు కొట్టుకుపోయాయి.



ఆత్మకూర్ సంతలో నిలిచిన వర్షపు నీరు

మరో మూడు రోజులే

ఆస్తిపన్ను ముందస్తు చెల్లింపుపై ఐదు శాతం రాయితీకి గడువు

- సద్వినియోగం చేసుకోవాలని మున్సిపాలిటీల్లో విస్తృత ప్రచారం
- సులభంగా చెల్లింపునకు ప్రత్యేకంగా క్యూఆర్ కోడ్
- పన్ను చెల్లింపుల్లో 17వ స్థానంతో అలంపూర్ ముందంజ
- రాష్ట్రస్థాయిలో మద్దూరు 35.. కోస్గి 77.. కొల్లాపూర్ 94వ స్థానం



క్యూఆర్ కోడ్



నారాయణపేటలో ముందస్తు ఆస్తిపన్ను చెల్లించిన వారికి రసీదు అందజేస్తున్న సిబ్బంది (ఫైల్)

నారాయణపేట: మున్సిపాలిటీల్లోని నివాస గృహాలు, వాణిజ్య సముదాయ భవనాలకు 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను ముందస్తు ఆస్తిపన్ను చెల్లించే వారికి రాష్ట్ర పురపాలక శాఖ 5 శాతం రాయితీ ఇచ్చింది. 30 రోజులపాటు ఈ అవకాశం ఇవ్వగా.. మరో మూడు రోజుల్లో (ఈ నెల 30) గడువు ముగుస్తోంది. ఉమ్మడి జిల్లాలోని అలంపూర్ మున్సిపాలిటీ ముందస్తు పన్ను వసూళ్లలో ముందంజలో.. రాష్ట్రస్థాయిలో 17వ స్థానంలో నిలిచిందని అధికారుల నివేదికల ద్వారా తెలుస్తోంది. మున్సిపాలిటీల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులతోపాటు ఈ పన్నుల రాబడితో ప్రగతి పరుగులు పెడుతుంది. ఆస్తిపన్ను సులభంగా చెల్లించేందుకు మున్సిపల్ అధికార యంత్రాంగం క్యూఆర్ కోడ్, ఇతర ఆన్‌లైన్ చెల్లింపులు నేరుగా మున్సిపాలిటీ ఖాతాలోకి జమ చేసుకునేలా వీలు కల్పించింది. ఈ మేరకు ఆస్తిపన్ను వసూలుపై ఆయా మున్సిపల్ అధికారులు దృష్టిసారించారు. రాయితీపై ఇప్పటికే మున్సిపాలిటీల్లో ఫ్లెక్సీలు, బోర్డుల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు.

■ కాగా.. సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌లో నూతనంగా ఏర్పాటైన మద్దూరు మున్సిపాలిటీ ముందస్తు పన్నుల వసూళ్లలో 35వ స్థానం, కోస్గి మున్సిపాలిటీ 77వ స్థానంలో నిలిచాయి. నారాయణపేట, మక్తల్ మున్సిపాలిటీల్లో పన్ను వసూలు చేయడంలో పోటీపడుతున్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు ఇలాఖాలోని కొల్లాపూర్ 94వ స్థానంలో నిలిచింది.

ప్రత్యేకాధికారుల పర్యవేక్షణలో..

మున్సిపాలిటీల్లో ఆస్తిపన్ను వసూళ్లపై ఎప్పటికప్పుడు మున్సిపల్ రెవెన్యూ అధికారులు, బిల్ కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లు వాకబు చేయాలని మున్సిపల్ కమిషనర్లకు ప్రత్యేకాధికారులుగా నియమితులైన అదనపు కలెక్టర్లు (లోకల్ బాడీస్) ఆదేశించారు. రోజువారిగా పన్ను వసూళ్లపై నివేదిక తెప్పించుకుంటూ పన్ను వసూళ్లు వేగిరం అయ్యేలా దిశానిర్దేశనం చేస్తున్నారు. తప్పనిసరిగా నిర్దేశించిన గడువులోగా లక్ష్యాన్ని చేరుకోవాలని సూచిస్తున్నారు.

క్యూఆర్ కోడ్.. వాట్సప్‌తోనూ చెల్లింపులు

ఆస్తిపన్ను చెల్లింపులు సులభతరంగా చెల్లించేలా మున్సిపల్ శాఖ ఏర్పాట్లు చేసింది. ఈ మేరకు httpr://cdma.telangana.gov.in/ ఈజీగా చెల్లించవచ్చు. అలాగే, ఏటీఎం, డెబిట్, క్రెడిట్ కార్డులు, ఇంటర్‌నెట్ బ్యాంకింగ్, క్యూఆర్ కోడ్, యూపీఐ ద్వారా నేరుగా సదరు మున్సిపాలిటీ ఖాతాలో జమ చేయవచ్చు. క్యూర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ ఇంటి ఆస్తి పన్ను చెల్లించవచ్చు. మున్సిపల్ శాఖ ఏర్పాటుచేసిన ప్రత్యేక క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి.. జిల్లా పేరు, మున్సిపాలిటీని ఎంపిక చేసుకొని ఇంటి నంబర్‌ను టైప్ చేస్తే ఆస్తిపన్ను ఎంత అనేది చూపిస్తుంది. ఈ విధానంతో అటు మున్సిపల్ సిబ్బందికి.. ఇటు వినియోగదారులకు ఎంతో మేలు కలగనుంది. దీంతోపాటు ప్రభుత్వ ఆదేశాలతో కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ వారు వాట్సప్ నం.9000253342ను ఆస్తిపన్ను చెల్లించేందుకు ఏర్పాటు చేశారు.

మున్సిపాలిటీల వారీగా ఆస్తిపన్ను వసూలు వివరాలిలా..

మున్సిపాలిటీ	ఆస్తులు	పన్ను డిమాండ్ (రూ.కోట్లలో)	వసూలైంది (రూ.కోట్లలో)	శాతం	రాష్ట్రస్థాయిలో స్థానం
అలంపూర్	3,558	0.47	0.09	19	17
వడ్డేపల్లి	4,045	1.05	0.17	16	26
అయిజ	8,142	1.63	0.22	13	48
గద్వాల	16,316	9.30	0.97	10	69
జడ్చర్ల	18,604	6.58	0.79	12	59
మహబూబ్‌నగర్	52,943	54.65	5.57	10	74
భూత్పూర్	3,592	3.11	0.12	04	133
పెబ్బేరు	5,245	1.05	0.15	14	40
కొత్తకోట	7,274	1.69	0.24	14	41
ఆత్మకూర్	5,263	2.05	0.21	10	73
అమరచింత	2,776	0.56	0.04	07	110
వనపర్తి	18,297	18.99	0.78	04	132
మద్దూరు	2,766	0.26	0.04	15	35
మక్తల్	7,566	1.99	0.24	12	57
కోస్గి	6,401	2.08	0.21	10	77
నారాయణపేట	9,219	5.66	0.47	08	93
నాగర్‌కర్నూల్	11,221	8.26	0.83	10	78
అచ్చంపేట	6,871	3.90	0.38	09	82
కొల్లాపూర్	6,541	1.57	0.13	08	94
కల్వకుర్తి	8,461	20.47	0.61	03	140

సద్వినియోగం చేసుకోండి



ముందస్తుగా ఆస్తిపన్ను చెల్లించిన వారికి 5 శాతం రాయితీ కల్పించారు. ఈ అవకాశాన్ని గృహ, దుకాణ యజమానులు సద్వినియోగం చేసుకోవాలి. డిజిటల్ చెల్లింపుతో మరింత సులభతరం కానుంది. – భోగేశ్వర్, మున్సిపల్ కమిషనర్, నారాయణపేట

క్లుప్తంగా

బావిలో పడి వృద్ధుడి మృతి

అడ్డాకుల: మండలంలోని కందూర్ గ్రామంలో బావిలో పడి వృద్ధుడు మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జనిగె రాములు(75) ఉదయం గ్రామానికి సమీపంలో ఉన్న మర్రిబాయి వద్దకు వెళ్లాడు. కాలకృత్యాలు తీర్చుకుంటుండగా అకస్మాత్తుగా అందులో పడి మునిగిపోయాడు. చాలా సేపటి తర్వాత బావిలో ఈతకు వెళ్లిన యువకులకు అందులో వృద్ధుడి మృతదేహం కనిపించింది. వెంటనే గ్రామస్తులకు సమాచారం ఇవ్వడంతో కుటుంబ సభ్యులు బావి వద్దకు వెళ్లి మృతదేహాన్ని బయటికి తీశారు. వృద్ధుడికి ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉండగా, కొన్నేళ్ల కిందట భార్య చనిపోయింది. వృద్ధుడి మృతిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



బోయరఘుపతి నాయుడు (ఫైల్)

పాన్‌గల్: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాసులు వివరాల ప్రకారం.. మండలంలోని బుసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బోయ రఘుపతినాయుడు(38) వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ అవసరాల కోసం అప్పులు చేశాడు. ఈనెల 2న వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి అంబులెన్స్‌లో జిల్లా ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు. ఆస్పత్రిలో 26 రోజుల పాటు చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి తండ్రి నారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి భార్య శ్రీలేఖ, ఇద్దరు కూతురులు, కుమారుడు ఉన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

- యువకుడి దుర్మరణం



శేఖర్ (ఫైల్)

గోపాల్‌పేట: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందిన ఘటన గోపాల్‌పేట మండలం తాడిపర్తి గ్రామ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ నరేశ్ కుమార్ వివరాల మేరకు.. జిల్లా కేంద్రంలోని హరిజనవాడకు చెందిన శేఖర్ (25) బైక్‌పై గోపాల్‌పేట మండలం బుద్ధారం నుంచి వనపర్తికి వెళ్తుండగా.. తాడిపర్తి గ్రామ సమీపంలోని ప్రమాదకర మలుపు (గొల్లోనిమిట్ట) వద్ద ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ప్రమాదంలో శేఖర్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా, శేఖర్ మరణవార్త తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు పెద్దఎత్తున ఘటనా స్థలానికి చేరుకున్నారు. పెళ్లి రోజు నాడే శేఖర్ మృత్యువాత పడటంతో వారి రోధనలు మిన్నంటాయి. మృతుడికి భార్య శిరీష, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

మానవపాడు: జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ చంద్రకాంత్ వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలం మైలారం తండాకు చెందిన రాత్లావత్ శ్రీకృష్ణ(24) కర్నూల్‌లోని ప్రైవేట్ వెంచర్‌లో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. శనివారం విధులు ముగించుకొని ద్విచక్రవాహనంపై నాగర్‌కర్నూల్‌కు బయలుదేరాడు. ఈ క్రమంలో మానవపాడు శివారులో గద్వాల ఎస్పీ కార్యాలయంలో విధులు ముగించుకొని సమద్ రోడ్డు దాటుతున్న క్రమంలో శ్రీకృష్ణ బైక్‌పై ఢీకొట్టాడు. దీంతో ఇద్దరు కిందపడ్డారు. శ్రీకృష్ణ తలకు బలమైన గాయాలు కాగా, సమద్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కర్నూల్ ఆస్పత్రికి 108లో తరలించగా, అప్పటికే శ్రీకృష్ణ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సమద్ హైదరాబాద్‌లోని కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. శ్రీకృష్ణ సోదరుడు రాత్లావత్ రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి మృతదేహం లభ్యం

మల్దకల్: మండలంలోని పెద్దపల్లి సమీపంలో ఆదివారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ నందికర్ వివరాల మేరకు.. పెద్దపల్లి సమీపంలోని కోళ్లఫారం వద్ద వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి వయసు దాదాపు 38 ఏళ్లు ఉండవచ్చని ఎస్ఐ తెలిపారు. పూర్తి వివరాలకు 87126 70295 నంబర్‌ను సంప్రదించాలని ఎస్ఐ తెలిపారు.

వేసవిలో చల్లగా..!

మహిళలకు చక్కటి ఉపాధి..



అంతారం సమీపంలో తాటి ముంజల విక్రయం

తాటి ముంజల విక్రయంతో ఈ ప్రాంతంలోని వందలాది మంది మహిళలు ఉపాధి పొందుతున్నారు. ఎండకాలం రెండు నెలలు మాత్రమే సీజన్ ఉండటంతో మగవారు గెలలు కోసిస్తే మహిళలు ఓపికగా కూర్చొని విక్రయిస్తుంటారు. కొందరు సొంత పొలాల్లో ఉన్న చెట్ల నుంచి తీసిన ముంజలు విక్రయించి ఉపాధి పొందుతుండగా.. మరికొందరు కొనుగోలు చేసి రహదారుల పక్కన, గ్రామాల్లో తిరుగుతూ అమ్ముతున్నారు. 12 తాటి ముంజలు రూ.100కు విక్రయిస్తుండగా.. ఈ సీజన్‌లో రోజు రూ.వెయ్యి నుంచి రూ.రెండు వేలకు పైగా సంపాదిస్తున్నారు. సొంత చెట్లు ఉన్నవారైతే మరింత లాభమే గడిస్తున్నారు.

జోరుగా తాటి ముంజల విక్రయాలు

- గండేడ్, కుల్కచర్ల ప్రాంతాల్లో అధికం
- కిడ్నీ వ్యాధులకు మేలంటున్న వైద్యులు
- గ్రామీణ మహిళలకు ఉపాధి



గండేడ్: మండు వేసవిలో ఉపాధి అవకాశాలు అంతంత మాత్రంగా ఉన్న సమయంలో పల్లెల్లో తాటి ముంజల విక్రయాలు మహిళలకు ఆసరాగా నిలుస్తున్నాయి. వీటిని గ్రామాల్లో విక్రయించడంతో పాటు పట్టణాలకు సైతం ఎగుమతి చేస్తున్నారు. తాటి ముంజలు తినడం ఆరోగ్యానికి ఎంతో మేలని వైద్యులు సూచిస్తున్నారు. ఓ వైపు ఆరోగ్యం.. మరోవైపు ఉపాధి కల్పిస్తూ ఆరోగ్య ప్రదాయినిగా నిలుస్తుంది. గండేడ్ మండలంతో పాటు పక్కనే ఉన్న కుల్కచర్ల మండలంలోని రుసుంపల్లి, చిన్నవార్వాల్, పుట్టపహడ్, అంతారం, ఘనాపూర్ తదితర గ్రామాల్లో తాటి చెట్లు అధికంగా ఉన్నాయి. పొద్దుపొద్దునే నోరూరించే తాటి కల్లుతో పాటు ముంజలు ఇక్కడ లభిస్తాయి. ఒక్కో చెట్టుకు వెయ్యి నుంచి 1,500 వరకు తాటి ముంజలు పండుతాయి.

మన్నెగూడలో విక్రయిస్తా..



తాటి ముంజలను వేరే వారి వద్ద పెద్దమొత్తంలో కొనుగోలు చేసి స్థానికంగా, పరిగి సమీపంలోని మన్నెగూడలో విక్రయిస్తా. అన్నీ ఖర్చులు పోను రోజు రూ.రెండు వేల వరకు వస్తున్నాయి. దాదాపు రెండు నెలల పాటు ఉపాధి లభిస్తుంది.

– రాములు, చిన్నవార్వాల్, గండేడ్

సాగు పనులతోపాటు..



ఏటా అంతారం గ్రామానికి వెళ్లి తాటి ముంజలు కొనుగోలు చేస్తాం. గతంలో రూ.300కు 100 ముంజలు ఇచ్చేవారు.. ప్రస్తుతం రూ.500 నుంచి రూ.600 వరకు వెచ్చించి కొనుగోలు చేయాల్సి వస్తోంది. వీటిని కోస్గి తదితర ప్రాంతాలకు తీసుకెళ్లి అమ్ముకుంటాం. వేసవిలో ముంజల విక్రయంతో ఉపాధి లభిస్తున్నది. వ్యవసాయం చేస్తూనే తాటి ముంజలు అమ్ముతా.

– మంజుల, గుండుమాల్, నారాయణపేట

పట్టణాలకు తరలిస్తూ..



విక్రయానికి సిద్ధంగా ఉన్న తాటి ముంజలు

ఇక్కడి ముంజలను ఏటా గంపల కొద్దీ హైదరాబాద్, ముంబైకి బస్సులు, రైళ్లలో తీసుకెళ్లి అక్కడ విక్రయిస్తున్నారు. 100 తాటిముంజలను స్థానికంగా రూ.450 నుంచి రూ.500 వరకు విక్రయిస్తుండగా.. అక్కడి వ్యాపారులు మాత్రం రెండు మూడింతలు ఎక్కువ ధరకు విక్రయించి సొమ్ము చేసుకుంటారు. అలాగే వికారాబాద్ జిల్లా తాండూరు, కొడంగల్, పరిగి, వికారాబాద్, మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని మహబూబ్‌నగర్, హన్వాడ, నారాయణపేట జిల్లాలోని గుండుమాల్, కోస్గి తదితర ప్రాంతాలకు తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. ప్రధాన కూడళ్లల్లో ఎక్కడ చూసినా తాటి ముంజలే దర్శనమిస్తాయి.

ఆరోగ్యానికి ఎంతో మేలు..

తాటి ముంజలు శరీరంలో ఉండే హానికర వ్యర్థాలను తొలగించడంలో అద్భుతంగా పని చేస్తాయి. వీటిలో బి–7, కే, సి విటమిన్లతో పాటు పొటాషియం, కాల్షియం, జింక్, ఐరన్‌లు పుష్కలంగా లభిస్తాయి. షుగర్ లెవల్, ఖనిజాల శాతాన్ని సమతుల్యం చేస్తాయి. వీటిలో అధిక నీటిశాతం ఉండటంతో వేసవిలో వడదెబ్బ, వాంతులు, విరేచనాలు, డీ–హైడ్రేషన్ కాకుండా చూస్తుంది. పొటాషియం అధికంగా ఉండటంతో రక్తపోటును అదుపు చేయడంతో పాటు గుండె వ్యాధులు దరి చేరవు. లివర్, జాండీస్ సమస్యలు రాకుండా చేయడంతో పాటు చెడు కొలెస్ట్రాల్‌ను తొలగిస్తుంది. ముఖ్యంగా మహిళలకు రొమ్ము క్యాన్సర్ రాకుండా కాపాడుతుంది. వీటిని అన్ని వయసుల వారు తినొచ్చు.

– డా. చంద్రశేఖర్, వైద్యాధికారి, గండేడ్

పోయిందనుకున్న ఫోన్ తెచ్చి ఇచ్చారు..



బాధితుడికి ఫోన్ అప్పగిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

జడ్చర్ల టౌన్: ఆర్టీసీ బస్సులో ఓ ప్రయాణికుడు పోగొట్టుకున్న ఫోన్‌ను ఆర్టీసీ ఉద్యోగులు తెచ్చి ఇచ్చిన ఘటన ఆదివారం జడ్చర్ల బస్టాండ్‌లో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. నారాయణపేట జిల్లా బండగుండు గ్రామానికి చెందిన అశోక్ యాదవ్ ఖమ్మం వెళ్లి, అక్కడి నుంచి స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యాడు. మొదట ఖమ్మం నుంచి హైదరాబాద్ బస్టాండ్‌కు బస్సులో చేరుకున్నారు. అక్కడ ప్లాట్‌ఫాంపై జడ్చర్లకు వచ్చేందుకు నాగర్‌కర్నూల్ డిపోకు చెందిన బస్సు సిద్ధంగా ఉండటంతో.. అతడు హడావుడిగా తన ఫోన్ బస్సులోనే మర్చిపోయాడు. నాగర్‌కర్నూల్ బస్సు ఎక్కి కొంత దూరం వచ్చాక తాను ఫోన్ మర్చిపోయిన విషయం తెలుసుకుని ఆందోళనకు గురయ్యాడు. జడ్చర్ల బస్టాండ్‌కు వచ్చి కంట్రోలర్ భాస్కర్ నాయక్, సెక్యూరిటీ నర్సింహులుకు జరిగిన విషయం చెప్పాడు. తన ఫోన్ ఖమ్మం నుంచి హైదరాబాద్ వచ్చిన బస్సులో మిస్సయిందని వాపోయాడు. స్పందించిన వారు.. టికెట్ నంబర్ ఆధారంగా ఖమ్మం–హైదరాబాద్ బస్సు కండక్టర్‌ను ఫోన్‌లో సంప్రదించి ఫోన్ గురించి ఆరా తీశారు. కండక్టర్ బస్సులో వెతికి.. ఫోన్ అక్కడే ఉన్నట్లు గుర్తించారు. విషయాన్ని అక్కడి కంట్రోలర్‌కు తెలియజేసి.. జడ్చర్లకు వచ్చేందుకు సిద్ధంగా ఉన్న మరో బస్సు డ్రైవర్ ద్వారా పంపిస్తున్నట్లు తెలియజేశారు. సదరు బస్సు డ్రైవర్, కండక్టర్ జడ్చర్ల కంట్రోలర్ ద్వారా ఫోన్‌ను అశోక్ యాదవ్‌కు అందించారు. పోయిందనుకున్న ఫోన్ తిరిగి అప్పగించినందుకు ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులకు బాధితుడు కృతజ్ఞతలు తెలిపారు.

'జవహర్ బాల్‌మంచ్‌ను గ్రామస్థాయికి విస్తరిస్తాం'



రాష్ట్రస్థాయి జేబీఎం క్యాంపులో పాల్గొన్న సుదర్శన్ తదితరులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జవహర్ బాల్‌మంచ్‌ను గ్రామస్థాయి వరకు విస్తరిస్తామని సంస్థ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ సుదర్శన్ అన్నారు. జేబీఎం నేషనల్ చైర్మన్ జీవీ హరి హైదరాబాద్‌లోని గచ్చిబౌలీ స్టేడియంలో శనివారం జవహర్‌బాల్ మంచ్ రాష్ట్రస్థాయి క్యాంపును ప్రారంభించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి చిన్నారులు పాల్గొనగా వారికి మాక్ పోలింగ్, ఇతర అంశాల్లో అవగాహన కల్పించడం జరిగిందన్నారు. అదేవిధంగా రాబోయే రోజుల్లో జేబీఎం ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాల గురించి చర్చించుకోవడం జరిగిందన్నారు. త్వరలో జిల్లాస్థాయిలో జేబీఎం సమావేశాలు నిర్వహిస్తామన్నారు.

ముమ్మరంగా శిథిలాల తొలగింపు



సొరంగం లోపల సహాయక చర్యలు చేపడుతున్న సిబ్బంది

- ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో కొనసాగుతున్న అన్వేషణ
- నేటికీ అంతుచిక్కని ఆరుగురి కార్మికుల ఆచూకీ

అచ్చంపేట: శ్రీశైలం ఎడమగట్టు కాల్వ సొరంగంలో గల్లంతైన కార్మికుల ఆచూకీ కోసం అన్వేషణ కొనసాగుతోంది. ఇందుకోసం డీ2 ప్రదేశం వరకు పేరుకుపోయిన మట్టి, బురద, బండరాళ్లు, టీబీఎం ప్లాట్‌ఫాం, శిథిలాలను 281 మీటర్ల వరకు పూర్తిగా తొలగించారు. సొరంగం మార్గంలో సహాయక చర్యలు చేపడుతున్న సిబ్బందికి నిషేధిత ప్రదేశం సవాల్‌గా మారింది. సాంకేతిక కమిటీ సూచనల మేరకు శనివారం నుంచి డీ–1 ప్రదేశంలో 10 మీటర్ల వరకు శిథిలాల తొలగింపు ప్రక్రియ చేపడుతున్నారు. దక్షిణమధ్య రైల్వే సిబ్బంది ప్లాస్మా థర్మల్ గ్యాస్ కట్టర్‌తో టీబీఎం ప్లాట్‌ఫాం భాగాలు కత్తిరించి లోకో ట్రైన్, ఎస్కవేటర్ల సహాయంతో సొరంగం బయటకు తరలిస్తున్నారు. ఉబికి వస్తున్న నీటి ఊటను భారీ మోటార్ల సాయంతో పంపింగ్ చేస్తూ కృష్ణానదిలోకి వదులుతున్నారు. అయితే నిషేధిత ప్రదేశంలో మట్టి, రాళ్లు కదిలిస్తే మరో ప్రమాదం జరిగే ఉండటంతో అంతకు మించి ముందుకు వెళ్లే అవకాశాలు కనిపించడం లేదు.

నిషేధిత ప్రదేశంలో..

డేంజర్ జోన్ పరిధిలో సహాయక చర్యలు చేపట్టేందుకు ఎస్‌డీఆర్ఎఫ్, సింగరేణి, హైడ్రా, దక్షిణమధ్య రైల్వే సిబ్బంది జంకుతున్నట్లు తెలిసింది. సొరంగం లోపలకు వెళ్లేందుకు వారు నిరాకరించడంతో ఆదివారం జేపీ కంపెనీకి చెందిన ఆరుగురు కార్మికులు నిషేధిత ప్రదేశానికి వెళ్లి వాటర్ జెట్‌లతో కాంక్రీట్ సెగ్మెంట్ బ్లాకుల లిఫ్టింగ్ క్రేన్ ప్లాట్‌ఫాం, టీబీఎం మిషన్ ప్లాట్‌ఫాంలపై పేరుకుపోయిన మట్టి, బురద తొలగించారు. గల్లంతైన కార్మికులు ప్లాట్‌ఫాంలో ఉండే అవకాశం ఉందని భావించి సహాయక చర్యలు చేపడుతున్నారు. టీబీఎం, క్రేన్ ప్లాట్‌ఫాం భాగాలను తొలగిస్తున్నారు. ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది ప్రభుత్వానికి తప్పుడు సమాచారం ఇవ్వడంతోపాటు సొరంగంలో నెలకొన్న భయానక పరిస్థితులు ఉన్న ప్రదేశంలోకి వెళ్లేందుకు నిరాకరించడంతో ఆరుగురు సిబ్బంది సస్పెండ్ చేసింది. ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బందికి వాటర్ జెట్ ఉపయోగించే అనుభవం ఉండటం, వారు విధుల్లో చేరకపోవడంతో నిషేధిత ప్రదేశంలో పనుల్లో జాప్యానికి కారణమవుతున్నట్లు తెలిసింది.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



చాకలపల్లిలో కాలి బూడిదైన నిత్యావసర సరుకులు

నవాబుపేట: షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన సంఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని చాకలపల్లి గ్రామంలో హరిజన మల్కమ్మ ఆదివారం మధ్యాహ్న సమయంలో ఇంట్లో నుంచి బయటికి వచ్చింది. అనంతరం ఒక్కసారిగా ఇంట్లో మంటలు రావటంతో భయభ్రాంతులకు గురైంది. దీంతో గ్రామస్తులు మంటలు ఆర్పే ప్రయత్నం చేసేలోపు ఇల్లు దగ్ధమైంది. ఇంట్లో దాచుకున్న కూలీ డబ్బులు కాలిబూడిదయ్యాయి. వాటితో పాటు నిత్యవసర సరుకులు సైతం కాలిపోవటంతో ఆమె బోరు న విలపించింది. ఈ విషయంలో బాధితురాలిని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



ఇంట్లో చిందర వందరగా పడవేసిన బట్టలు

జడ్చర్ల: జడ్చర్ల పట్టణంలో భారీ చోరీ జరిగింది. సీఐ కమలాకర్ వివరాల మేరకు.. 9వ వార్డులోని అశోక్‌నగర్–3లో నివాసం ఉంటున్న శ్రీనివాసమూర్తి శనివారం రాత్రి 7 గంటల సమయంలో ఇంటికి తాళంవేసి.. ఉద్యోగ నిర్వహణకు నాగాపూర్ వెళ్తున్న తన కూతురికి హైదరాబాద్‌లో సెండాఫ్ ఇచ్చేందుకు వెళ్లారు. కూతురిని బస్సు ఎక్కించిన అనంతరం అర్ధరాత్రి తిరిగి ఇంటికి చేరుకున్నారు. అయితే ఇంటి తాళాలు విరగొట్టి ఉండటంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇంటి లోపలికి వెళ్లి చూడగా.. బీరువా తాళాలు విరగొట్టి ఉన్నాయి. అందులో దాచిన 12 తులాల బంగారు ఆభరణాలను దొంగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. ఇంట్లో వస్తువులను చిందర వందర చేశారు. క్లూస్ టీంకు సాంకేతిక ఆధారాలు దొరకకూడదన్న కారణంతో మిర్చి పౌడర్ చల్లారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆలయంలో వెండి తొడుగు చోరీ

ఇటిక్యాల: ఆలయంలో వెండి తొడుగు చోరీకి గురైన సంఘటన మండల పరిధిలోని సాతర్లలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు గ్రామంలో వేణుగోపాల స్వామి ఆలయంలోకి శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు ప్రవేశించి సుమారు మూడున్నర కిలోల వెండి తొడుగును అపహరించుకుపోయారు. దీని విలువ సుమారు రూ.4లక్షల వరకు ఉంటుంది. ఈ సంఘటనపై ఇటిక్యాల పీఎస్‌లో ఫిర్యాదు చేసినట్లు వారు పేర్కొన్నారు.

పులకించిన శ్రీరామకొండ



స్వామివారిని దర్శించుకుంటున్న ఎంపీ డీకే అరుణ

కోయిల్‌కొండ: ఆదివారం అమావాస్య సందర్భంగా మండలంలో ప్రసిద్ధిగాంచిన శ్రీరామకొండ క్షేత్రం భక్తులతో పులకించింది. శ్రీరాముడిని దర్శించుకునేందుకు శనివారం రాత్రి నుంచే భక్తులు తరలివచ్చి కొండపై ఉన్న కోనేరులో స్నానాలు ఆచరించి ఆదివారం తెల్లవారుజామున 3 గంటల నుంచే దర్శించుకున్నారు. హైదరాబాద్, కర్నూలు, మెదక్, రంగారెడ్డి, రాయచూర్ తదితర ప్రాంతాల భక్తులు భారీగా తరలివచ్చారు. వచ్చిన భక్తులకు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నాయకులు అన్నదానం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ విజయ్‌భాస్కర్ సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆలయ పునఃనిర్మాణానికి కృషి : ఎంపీ డీకే అరుణ

మహిమాన్విత శ్రీరామకొండ క్షేత్రంలో ఆలయ పునః నిర్మాణానికి కృషి చేస్తానని ఎంపీ డీకే అరుణ అన్నారు. ఆదివారం ఆమె శ్రీరామకొండ క్షేత్రాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి మాట్లాడారు. తాను ఆలయానికి మొదటిసారి వచ్చానని.. శ్రీరామ పాదాన్ని దర్శించుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు.



అలంకరణలో శ్రీరాముడి పాదం



దర్శనానికి భక్తుల బారులు



రాజగోపురం వద్ద దీపాలు వెలిగిస్తూ..

కురుమూర్తి కిటకిట

ఆదివారం అమావాస్య సందర్భంగా పోటెత్తిన భక్తులు

- కురుమూర్తిలో మార్మోగిన గోవింద నామస్మరణ

చిన్నచింతకుంట: పాలమూరు ప్రజల ఆరాధ్య దైవం అమ్మాపురం కురుమూర్తి ఆలయానికి ఆదివారం అమావాస్యను పురస్కరించుకొని భక్తులు పోటెత్తారు. అర్చకులు తెల్లవారుజామున ఆలయాన్ని శుద్ధిచేసి సుప్రభాతసేవ అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. ఉమ్మడి పాలమూరు జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధికసంఖ్యలో ఉదయమే తరలివచ్చి దర్శనానికి వరుసలో నిలుచున్నారు. కొందరు భక్తులు మెట్లపై దీపాలు వెలిగిస్తూ గోవింద నామస్మరణ చేస్తూ స్వామివారిని దర్శించుకున్నారు. మరికొందరు భక్తులు తలనీలాలు సమర్పించి కొండ దిగువన మట్టికుండలో పచ్చిపులుసు, అన్నం తయారుచేసి స్వామివారికి నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే భక్తులు కొండపైన అలివేలు మంగమ్మ, చెన్నకేశవస్వామి, ఆంజనేయ స్వామి, ఉద్దాల మండపాన్ని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఈఓ మదనేశ్వర్ రెడ్డి, కమిటీ సభ్యులు బాదం వెంకటేశ్వర్లు అన్ని ఏర్పాట్లు చేశారు. పల్లమర్రికి చెందిన మహేశ్వర్ రెడ్డి బ్రదర్స్ బెల్లం సాయిలు ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

అలంపూర్ ఆలయాల్లో చండీహోమాలు..



చండీహోమంలో పాల్గొన్న భక్తులు

అలంపూర్: ఆదివారం అమావాస్యను పురస్కరించుకొని అలంపూర్ ఆలయాలకు వివిధ ప్రాంతాల భక్తులు భారీగా తరలివచ్చారు. జోగుళాంబ, బాల బ్రహ్మేశ్వరస్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అమ్మవారి ఆలయంలో నిర్వహించిన చండీ హోమంలో 288 మంది భక్తులు పాల్గొన్నట్లు ఈఓ పురందర్‌కుమార్ తెలిపారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. భక్తులకు అన్నదాన సత్రంలో అన్నప్రసాదం అందజేశారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటి వసతి కల్పించారు.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న పతంగి రాంబాబు

కొత్తకోట రూరల్: మండలంలోని నాటవెల్లి గ్రామ శివారు మానవత విశ్వవిద్యాలయం ఆవరణలో ఆదివారం విద్య, ఆరోగ్యం, సేంద్రియ వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించినట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాసచౌదరి తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పతంగి రాంబాబు హాజరై సేంద్రియ వ్యవసాయంపై రైతులకు సలహాలు, సూచనలు చేశారు. పంట, తోట గురించి వివరించడంతో పాటు సాగుబడి అనే పుస్తకాన్ని అందజేశారు. ప్రకృతిని అందరూ కాపాడాలని, మిద్దె తోటల ప్రాముఖ్యం, సేంద్రియ ఆహార విలువలు తెలుసుకోవాలన్నారు. అనంతరం నాటవెల్లి, పామాపురం గ్రామాల నుంచి వచ్చిన ప్రజలకు కంటి పరీక్షలు చేయడంతో పాటు కంటి అద్దాలను డాక్టర్ బొగు సురేష్ అందజేశారు. పిల్లలందరికి మంచి ఆరోగ్యం, ఉత్తమ సంస్కారం ఇవ్వడం మనందరి బాధ్యత అని వారు తెలిపారు. మానవతా సంస్కార విద్యలో భాగంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమిష్టిగా కృషి చేస్తేనే లక్ష్యం చేరుకోగలమన్నారు.

పిడుగుపాటుతో ఇద్దరు మృతి



మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



ఆంజనేయులు (ఫైల్)



కురుమూర్తి మృతదేహం

మక్తల్: పిడుగుపాటుతో ఇద్దరు మృతిచెందిన ఘటన మక్తల్ మండలం ఉప్పర్‌పల్లి, దాదాన్‌పల్లి గ్రామాల్లో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. ఉప్పర్‌పల్లికి చెందిన సవారప్ప తన కుమారుడు మేస్త్రీ ఆంజనేయులు (38)తో కలిసి వ్యవసాయ పొలానికి వెళ్లాడు. అక్కడ ఆరబోసిన ధాన్యాన్ని కుప్పగా పోస్తుండగా.. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈ క్రమంలో పిడుగుపాటుకు గురై ఆంజనేయులు అపస్మారక స్థితికి చేరుకోగా.. తండ్రి సవారప్ప సురక్షితంగా బయటపడ్డాడు. వెంటనే ఆంజనేయులును మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య శిరీష, కుమార్తె ఉన్నారు.

దాదాన్‌పల్లిలో బాలుడు..

మక్తల్ మండలం దాదాన్‌పల్లిలో గొర్రెలను మేపేందుకు వెళ్లిన ఓ బాలుడు పిడుగుపాటుకు గురై మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. దాదాన్‌పల్లికి చెందిన కురుమూర్తి (16) తన స్నేహితులతో కలిసి గ్రామ సమీపంలోని కృష్ణానది ఒడ్డున గొర్రెలను మేపుతుండగా.. పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ హన్మంతు, శివారెడ్డి ఉన్నారు.

